# ప్రేమ



మల్లాది వెంకట కృష్ణమూర్తి

కాశీపతి నాకు చాలా మంచి స్నేహితుడు. ఈనాటిదికాదు మా స్నేహం ఇరవై తొమ్మిదేళ్ళనుంచి ఒకరినొకరం ఎరుగుదుం మేం  మా అభిరుచులు, మనసులు కలవటంవల్ల మా మైత్రి గట్టిపడుతూ వచ్చింది కాని, కొంచెం కూడా తగ్గలేదు.

కాశీపతి, నేను సమవయస్కులం. మొట్టమొదటిసారి, మా పదమూడో ఏట, కలిసాం ఇద్దరం. ఏ రోజో, ఎలాగో, నాకు గుర్తులేదు మొదట ఏం మాట్లాడుకున్నామో కూడా గుర్తులేదు. కాని మా స్నేహం కలిసింది మాత్రం సంగీతం మేష్టారు ఇంట్లోనే

నేను, కాశీపతి వీణ నభ్యసించాము. అదృష్టవశాత్తు కాశీపతికి వీణ వాయించటం బాగా పట్టుపడింది. నేను మధ్యలోనే మానేసి వుద్యోగంలో స్థిరపడ్డాను. కాశీపతి ఇప్పుడు గొప్ప వైణికుడు. కాశీపతి వీణ వాయిస్తూంటే వినడం ఓ చక్కని అనుభవం

మా ఇద్దరికీ ఒకటి, రెండు సంవత్స

రాల తేడాలో వివాహాలు అయి పోయాయి కాశీపతికే అయింది ముందు. కాశీపతి మామగారికి రైస్ మిల్ ఒకటి వుంది కాశీపతి, ఆయన తదనంతరం రైస్ మిల్‌ని నడుపుతూ, వీణ కచేరీలు చేస్తున్నాడు

కాశీపతికి భార్యంటే వల్లమాలిన అభిమానం 'నా భార్య లేకపోతే నేను బ్రతకలేను" అని నోరుతెరిచి చెప్పక పోయినా, ఆ విధంగా ప్రవర్తించేవాడు. ఆవిడ నోరు అంత మంచిదికాదు కాశీపతిని తిట్టనిరోజు అరుదనుకుంటాను, ఆవిడ కాశీపతిని తిట్టడం ప్రారంభించిన రోజునుంచి, గయ్యాళి అయినా, ఆవిడకి కూడా కాశీపతి అంటే మక్కువ ఎక్కువ

కాశీపతి నాకు మరింత దగ్గరయ్యాడు గత అయిదేళ్ళుగా అందుకు కారణం నా భార్యపోయి, నేను వంటరిగాణ్ణి అవటం సంతానం లేకపోవటంవల్ల నేను చెయ్యికాల్చుకుంటూ, నా తిండి నేనే వండుకోవాల్సి వస్తోంది.

నా పరిస్థితి కాశీపతికి బాగా జాలి కలిగించింది నేనున్న స్థితిలో కాశీపతి బహుశ వుండలేడనుకుంటాను అలా భార్యావిహీనుడై వంటరిగా గడపడం కాశీపతికి నరకంతో సమానం అనుకుంటాను. అందుకే అంటూంటాడు.

"మళ్ళి పెళ్ళి చేసుకో"

నాకు పెళ్ళిమీద ఆసక్తి చచ్చి పోయింది మా ఆవిడ బ్రతికున్నప్పుడే. సంసారం అంటే విరక్తి ఏర్పడి చాలా సంవత్సరాలవడంవల్ల, జీవితం ఇప్పుడే బావుంటోంది అనిపిస్తోంది మళ్ళీ ఆ పొరపాటు చేయదలచుకోలేదు.

ప్రేమ గురించి నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి ఇద్దరు కలిసి ఒకేచోట జీవించటం జరిగితే, కొంత కాలానికి కాకపోయినా, కొంతకాలానికయినా ఆ ఇద్దరిమధ్యా ప్రేమ జనిస్తుంది ముందరనుంచే ఒకరంటే మరొకరికి ప్రేమవుంటే, ఆ ఇద్దరూ కొంతకాలం కలిసి జీవిస్తే, వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ నశిస్తుంది క్రమంగా... లేదా గాఢమవుతుంది. నా వుద్దేశంలో, అంటే, ప్రేమకి తాలిమెట్టు ఇద్దరు వ్యక్తులు దగ్గరయే అవకాశం మాత్రమే. శారీరకంగానే బలపడుతుంది ప్రేమ.

అలాంటి అవకాశం శూన్యమయితే, ప్రేమ గురించిన ప్రశ్నే వుండదు. ప్రేమంటే ఇంతేనని నా అభిప్రాయం

* * *

అర్ధరాత్రి కాశీపతి రెండో కొడుకు వచ్చి మా యింటి తలుపు తడితే మెలకువ వచ్చింది నాకు. లేచి తలుపు తెరచి ఏం జరిగిందని అడిగాను.

"నాన్నగారు పిల్చుకు రమ్మన్నారు మిమ్మల్ని వున్నపళంగా వేదవతి చచ్చిపోయింది" చెప్పాడు

"అరే! ఎప్పుడూ" అన్నాను. తలుపు దగ్గరకి నొక్కి, బయట గొళ్లెం పెట్టి కాశీపతి దగ్గిరకు బయలుదేరాను. ఎదురిల్లే కాశీపతిది.

వేదవతి కాశీపతి రైస్ మిల్‌లో పని చేసే మేస్త్రీ భార్య. ముప్పై, ముప్పై అయిదు మధ్యుంటుంది వేదవతి వయసు. మాకన్నా ముందే వేదవతి వివాహం అయింది. కాశీపతి మామగారు, కాశీపతి పెళ్ళయ్యాక, వేదవతి భర్తకి తమ మిల్లులో వుద్యోగం ఇచ్చాడు.

వేదవతి, కాశీపతి, నేను—మేం ముగ్గురం ఒకరికొకరు బాగా తెలుసు. వేదవతి పుట్టి, పెరిగింది కాశీపతి ఇంట్లోనే. ఇంటిపని చాలాభాగం వేదవతే చేస్తుంది.

కాశీపతి ఇంటి వెనక అవుట్ హౌస్‌లో, నడవాముందు చాపవేసి పడుకోపెట్టారు వేదవతి శవాన్ని. చికెన్‌పాక్స్ ఆమెకి వచ్చిన సంగతి తెలియదు నాకు. మొహం ఘోరంగా మారిపోయింది చికెన్‌పాక్స్‌వల్ల. నాటు వైద్యంతో ముదరపెట్టిన కారణంగా ఆ పాడురోగం బలితీసుకుంది ఆ ఇద్దరు పిల్లల తల్లిని.

మనిషికి మరో మనిషి సహాయం ముఖ్యంగా మూడుసార్లు వస్తుంది. కానుపప్పుడు, పెళ్ళి జరిగేటప్పుడు. మూడోసారి చావప్పుడు.

వేదవతి మొగుడు శవానికి కొద్దిగా దూరంగా కూర్చుని ఏడుపుని దిగమింగుతున్నాడు. కాశీపతి ధైర్యం చెప్తున్నాడు వేదవతి మొగుడుకి. అందరం తలోదిక్కూ బయలుదేరాం చేయాల్సిన కార్యక్రమానికి కావల్సిన ఏర్పాట్లకి.

నేను నాకు అప్పచెప్పిన ఏర్పాట్లు చేసి, తెల్లవారుజామున తిరిగి వచ్చాను. కాశీపతి భార్య నిద్రపోతోంది నేలమీద కొంగుపరచుకుని. కిటికీలోంచి ఆవిడ తప్ప, కాశీపతి కనపడలేదు నాకు.

ఇంటి వెనకాల అవుట్‌హౌస్‌వైపు నడిచాను. అవుట్‌హౌస్ ముందున్న దృశ్యాన్ని చూసి చటుక్కున ఆగాను. వేదవతి శవం అక్కడే వుంది. వేదవతి మొగుడు లేడక్కడ. కాశీపతి కొడుకులూ లేరక్కడ. ఒక్క కాశీపతి మాత్రమే ఉన్నాడు ఇప్పుడు.

వేదవతి శవాన్ని తన ఒళ్లో పడుకోపెట్టుకుని కూనిరాగం తీస్తున్నాడు. ఎంతో బలవంతంగా కాశీపతి తన దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నాడని అర్థమైంది నాకు. అంతకు మునుపెన్నడూ కాశీపతి ఏడవటం గమనించలేదు నేను. తన మామగారు మరణించినప్పుడు కూడా ఇంతగా ఏడవలేదు కాశీపతి.

నాకు ఆశ్చర్యంవేసింది. చికెన్‌పాక్స్ అంటే అందరికీ భయమే. వేదవతి మొగుడే ఆ శవాన్ని తాకకుండా, దూరంగా కూర్చుని బాధ

పడ్డాడు. కాశీపతి మాత్రం ఆ శవాన్ని అక్కున చేర్చుకుని రోదిస్తున్నాడు, వంటరిగా, రహస్యంగా !

నా స్మృతిపథంలో లీలగా మెదిలిందో సంఘటన చాలా చాలా సంవత్సరాల క్రిందటి సంఘటన. కాశీపతి పెళ్ళికాక ముందు ఓసారి అయిదు రూపాయలు పెట్టి ఎర్రపూల రవికల గుడ్డకొన్నాడు

"దేనికి ?" అడిగాను నేను.

"నా ప్రేయసికి" అన్నాడు ఎగతాళిగా నవ్వి

"అబ్బో ! ఎవరో ?" అడిగాను

"రహస్యం."

గుళ్ళో అమ్మవారికి అయివుండచ్చనుకున్నాను. కాని కొన్నినెలల తర్వాత అచ్చం అలాంటి రవిక వేదవతి కట్టుకోగా చూసాను. ఆ సంగతి కాశీపతిని అడగలేదు నేను కాశీపతీ చెప్పలేదు నాకు. మర్చిపోయాను.

నేను చూస్తూండగానే కాశీపతి గబగబా వేదవతి శవాన్ని చాపమీదికి జరిపి, దూరంగా జరిగి కూర్చుని, కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

నాకు ఎంతో విచిత్రం అనిపించింది కాశీపతి ప్రవర్తన.

* * *

'ప్రేమ' గురించి నాకు పూర్తిగా తెలుసనుకున్నాను. కాని నాది పొరపాటు. కేవలం ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించినంతమాత్రానే "ప్రేమ" కలగదు. ప్రేమకి తొలిమెట్టు దగ్గరయే అవకాశం మాత్రమే కాదు. శరీర సంపర్కం కూడా కాదు.

ప్రేమ శారీరకం మాత్రమే అవుతుంది అలా అయితే. మరో ప్రేమ కూడా వుంది దాన్ని గురించి నాకు ఇంకా బాగా తెలియదు. కాశీపతి నేను అడగకుండా దాన్ని గురించి చెప్తాడను కోను నేనెలా అడగను ? అందులో వేదవతి పనిమనిషి కూతురు.

ఒకటిమాత్రం తెలిసింది ఒక రకం ప్రేమకి కొలబద్ద "ముద్దు" అయితే, మరోరకం ప్రేమకి ప్రమాణం "కన్నీటి బొట్టు" మాత్రమే. కాని, ఏది గొప్పది? నాకిప్పుడర్థమైంది.